నెత్తురోడ్డుతున్న రహదారులు

నెల వ్యవధిలో 16 మంది మృత్యువాత

- మృతుల్లో అత్యధికులు యువకులే..

మేడ్చల్‌రూరల్: అతివేగం హానికరం.. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు.. ప్రమాదాలకు గురి కావొద్దు.. ఇలాంటి కొటేషన్లు నిత్యం ఎన్ని చూస్తున్నా.. ప్రభుత్వాలు, పోలీసులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఇలా ఎంత అవగాహన కల్పిస్తున్నా.. ఎవరో ఒకరు చేస్తున్న తప్పు కారణంగా ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వారిని నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రమాదాల్లో యువతే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారు. కుర్రకారు అతివేగం కూడా ప్రమాదాలకు కారణం అవుతోంది. నిర్లక్ష్యం, రాంగ్‌రూట్, మద్యం, అతివేగం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం ఇలా.. ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయి.

యువతే ఎక్కువ..

ఎంతో భవిష్యత్ ఉన్న యువత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆందోళన కలిగించే విషయం. మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. మరోవైపు భారీ వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా రోడ్డుపై వెళ్తున్న పాదచారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

- ఈ నెల 7వ తేదీ తెల్లవారు జామున కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీసర చౌరస్తా నుంచి యాద్గార్‌పల్లి వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టడంతో నగరంలోని అల్వాల్ ప్రాంతానికి చెందిన బీబీఏ విద్యార్థిని తుషార(18), యువకుడు భవేశ్‌రావు(17) ఇద్దరు అక్కడికక్కడే మరణించగా మరో యువతి హరిప్రియ, యువకులు ఫిలిప్స్, రుబిన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. లాంగ్ డ్రైవ్ అంటూ మద్యం సేవించి వేగంగా వాహనం నడపమే ప్రమాదానికి కారణమైంది.
- ఈ నెల 12న మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెక్‌పోస్ట్–కిష్టాపూర్ రోడ్డులో తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న బైక్– బొలెరో వాహనం ఢీ కొట్టిన ఘటనలో మండలంలోని రావల్‌కోల్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు భానుగౌడ్(17), హరికృష్ణ(21)లు అక్కడికక్కడే మరణించారు. యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక నిర్ధారణలో తేలింది.
- తిరుమల దైవదర్శనానికి వెళ్లి వస్తూ ఈ నెల 14న శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించగా, మరో నలుగురు క్షతగాత్రులుగా మారారు. కుత్బుల్లాపూర్‌కు చెందిన కారు డ్రైవర్ మారుతి(31), బాల్‌రాజ్‌గౌడ్(43)తో పాటు తన అశోక్ లెలాండ్ వాహనం టైరు పంక్చర్ అవ్వడంతో పార్కింగ్ ఏరియాలో వాహనాన్ని నిలిపి మరమ్మతులు చేస్తున్న వాహన డ్రైవర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రసాద్(24)లు మరణించారు. ఈ ఘటనలో ఇన్నోవా కారు డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడమే కారణం.
- ఈ నెల 14న డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా మేడ్చల్ పట్టణంలో కంటైనర్ లారీ బీభత్సం సృష్టించి రోడ్డుపై వెళ్తున్న పాదచారులు సంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి యశోద(28), మేడ్చల్‌కు చెందిన సుభాష్ చంద్ర(38)ను ఢీ కొట్టడంతో వారు అక్కడికక్కడే మరణించారు. గత నెలలో మేడ్చల్, శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రోడ్డు దాటుతున్న వారిపైకి అతివేగంగా లారీ దూసుకెళ్లిన ఘటనల్లో అమాయకులు ప్రాణాలు విడిచారు.
- ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి డివైడర్, విద్యుత్ స్తంభం ఢీ కొన్న ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయాలపాలయ్యారు. సైకిలిస్టును లారీ ఢీ కొట్టడంతో ఒకరు మరణించారు.



శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్‌పై అతివేగం కారణంగా జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఇన్నోవా కారు (ఫైల్)



కీసరలో యువకులు మద్యం మత్తులో వేగంగా వెళ్లడంతో చెట్టును ఢీ కొట్టిన కారు (ఫైల్)



శామీర్‌పేట్‌లో బొలెరో వాహనం ఢీకొనడంతో మృతిచెందిన ద్విచక్రవాహన దారుడు(ఫైల్)

నెల రోజుల వ్యవధిలో 16 మంది మృతి

మేడ్చల్ నియోజకవర్గంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగాయి. నిత్యం ఏదో ఒక చోట వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే నియోజకవర్గ వ్యాప్తంగా 16 మంది మృత్యువాత పడ్డారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతం కావడం, 44వ జాతీయ రహదారి, రాజీవ్ రహదారి, వరంగల్ హైవే నియోజవర్గ పరిధిలో ఉండటంతో ప్రమాదల సంఖ్య ఎక్కువగా ఉండటానికి కారణంగా మారింది.

జాగ్రత్తలు పాటిస్తే మేలు



వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. మనం సరిగ్గా వెళ్లినా వచ్చే వారు కూడా జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదానికి గురికాక తప్పదు. డ్రైవింగ్ చేసే సమయంలో వేగం కన్నా ప్రాణమే మిన్న అని.. తమ కోసం తమ కుటుంబం వేచి ఉంటుందని మదిలో ఉంచుకుంటే ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చు. ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపవద్దు. రవాణా శాఖ సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు.

– సామల వెంకటరెడ్డి, ఏసీపీ, మేడ్చల్

కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దు.. ముంచుతది..

- రేవంత్‌రెడ్డి సీట్లు అమ్ముకుంటున్నడు..
- మేడ్చల్ జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేసి..
- గన్‌మెన్లను వదులుకోండి
- మంత్రి మల్లారెడ్డి ఆగ్రహం



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దని.. నిండా ముంచుతుందని, తెలంగాణను సర్వతోముఖాభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి సీఎం చేయాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. కొర్రెముల్ చెరుకు బాలయ్య గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ జెడ్పీ చైర్మన్‌పై మంత్రి విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి, కుమారుడికి జెడ్పీ చైర్మన్ పదవి ఇచ్చి అందలమెక్కిస్తే ఎందుకు కాంగ్రెస్‌లో చేరావో చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కండువా కప్పుకున్నవు దమ్ముంటే కొడుకుతో జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేయించాలని, గన్‌మెన్లను ప్రభుత్వ వాహనాన్ని వాపస్ పంపాలని డిమాండ్ చేశారు. వజ్రేశ్‌యాదవ్‌కు అమ్ముడుపోయి కాంగ్రెస్‌లో చేరావని, రేవంత్‌రెడ్డి ఎంపీగా గెలిచి పైసా అభివృద్ధి చేయాలన్నారు. సీట్లు అమ్ముకుంటున్న రేవంత్‌రెడ్డికి వత్తాసు పలుకుతున్నవు, నిజాయితీ ఉంటే మేమిచ్చిన పదవిని వదిలిపెట్టాలని అన్నారు. వజ్రేశ్‌యాదవ్ గెలిస్తే ఏమీ చేయలేడని, దొంగ ప్లాట్లు అమ్ముతడు, మూడోసారి ఓడిపోతాడన్నారు. చామకూర భద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

అవినీతిపరుడు మంత్రి మల్లారెడ్డి ఓటమి ఖాయం

- కబ్జాలు తప్ప చేసిన అభివృద్ధేమీ లేదు..
- మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా అవినీతికి పాల్పడుతున్న మంత్రి మల్లారెడ్డిని ఓడిద్దామని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో చౌదరిగూడ మాజీ సర్పంచ్ నక్క వరలక్ష్మీ, నక్క నరసింహ దంపతులతో పాటు వందలాది మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రతాపసింగారంలోని సుధీర్‌రెడ్డి నివాసంలో వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి పాలు, పూలు అమ్మిన అని చెప్పే మంత్రి సీట్లు అమ్ముకున్నాని మాత్రం చెప్పడన్నారు. రిజిస్ట్రేషన్ పాట్లను కబ్జా చేస్తున్నాడని, ఇటీవల జోడిమెట్ల సమీపంలో కబ్జా చేశాడని ఆరోపించారు. అవినీతి పరుడైన మంత్రి మల్లారెడ్డిని ఓడించడానికే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లానన్నారు.

మంత్రి మల్లారెడ్డిని ఓడించాలి

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ అవినీతి పాలనను కొనసాగిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్, స్థానిక శాఖ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యులు బోజిరెడ్డి, సుధాకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, శ్రీనివాస్ గౌడ్, నర్సింహ, నర్సింగ్ రావుముదిరాజ్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో ఇంటింటి కాంగ్రెస్ ప్రచారం



దమ్మాయిగూడలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కీసర: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు గోగుల సరితావెంకటేష్ అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా బుధవారం దమ్మాయిగూడలోని వివిధ కాలనీల్లో నిర్వహించిన ఆరు గ్యారంటీల కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి ఓటమి ఖాయమన్నారు. ప్రజలకు సేవ చేయడం మరిచి సొంత పనులు, రియల్ ఎస్టేట్ పేరుతో డబుల్ రిజిస్ట్రేషన్ భూములు కొనుగోలు చేయడం వంటి పనులు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్ప రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ వెంకటేష్, ముప్ప శ్రీలత, నేతలు సోమేష్, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

అల్వాల్: దసరా పండగ సందర్భంగా తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్‌ను బుధవారం టీజేఎస్ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు భద్రగమ ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల దయాకర్, రెడ్డిపల్లి శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలోని హనుమాన్ దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఈవో వెంకన్న, దేవాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శులు మండల రాధాకృష్ణయాదవ్, చింతల మల్లేష్‌యాదవ్, విజయ్‌కుమార్, జీడీ సత్యనారాయణగౌడ్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం మల్లాపూర్ వీఎస్‌ఆర్ గార్డెన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఉప్పల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం అందజేత

మల్లాపూర్: అశోక్‌నగర్‌కు చెందిన ధీరవత్ రాముల బాయ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఎల్‌ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు అశోక్, సంపత్, వెంకటేష్, గణేష్, దీపక్‌సింగ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేలను అందజేశారు.

కురుమ సంఘం నేత చిందం పెంటయ్య మృతి

ఉప్పల్: ఉప్పల్ భరత్‌నగర్ కాలనీకి చెందిన కురుమ సంఘం నేత చిందం పెంటయ్య బుధవారం మృతి చెందారు. వెలుగుట్ల దుర్గా మల్లికార్జున స్వామి దేవాలయ ట్రస్టీ సభ్యులుగా ఉన్నారు. ఆలయాల నిర్మాణం కోసం విశేషంగా కృషి చేసిన ఆయన మృతితో ఉప్పల్ భరత్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరినీ ఆదుకుంటూ స్థానికంగా ఎవరికి ఏ సహాయం కావాలన్న వెంటనే స్పందించేవారని స్థానికులు చెప్పారు.

27న మేడ్చల్‌లో కాంగ్రెస్ సమావేశం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ సమావేశం ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27వ తేదీన సమావేశం నిర్వహించి వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుకోసం పని చేయాల్సిన తీరుపై అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్, అగ్ర నాయకులు సుధీర్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్ వివరిస్తారని తెలిపారు. మేడ్చల్, శామీర్‌పేట్ మండలాల అన్ని గ్రామాల నాయకులు, మున్సిపాలిటీల నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశం రోజున కాంగ్రెస్‌లో భారీగా చేరికలు ఉంటాయని వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మేడ్చల్ నాయకులు నాగభూషణం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల నియామకం

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్, రాజబొల్లారం గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి బూత్ కమిటీలను నియమించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా గడప గడపకూ పార్టీ మేనిఫెస్టో, పథకాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజమల్లారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, సర్పంచ్ బాబుయాదవ్, మండల యూత్ అధ్యక్షులు హరత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలు ముదిరాజ్, ఉపసర్పంచ్‌లు వెంకటేశ్, నారాయణ, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజబొల్లారంలో బీఆర్‌ఎస్ బూత్ కమిటీలతో నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం

బోడుప్పల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 26, 27 డివిజన్‌లో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయడంలో పూర్తి విఫలమయ్యారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న మల్లారెడ్డి తన నిధుల నుంచి బోడుప్పల్‌కు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బోడుప్పల్‌కు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, పొద్దుటూరు శోభారాణి, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్, నేతలు బొమ్మక్ రమేష్, హరినాథ్‌రెడ్డి, రాపోలు శంకరయ్య పాల్గొన్నారు.



ప్రచారంలో వజ్రేష్‌యాదవ్

ఎన్నికల తనిఖీల్లో రూ.3.49 కోట్ల పట్టివేత

- అన్ని పత్రాలు ఉన్నందున రూ.2.11 కోట్లు ఇచ్చేశాం..
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పలుచోట్ల తనిఖీలు, చెక్ పోస్టుల వద్ద పోలీసులు రూ.3,49,92,241 స్వాధీనం చేసుకోగా, జిల్లా గ్రీవెన్స్ కమిటీ(ఫిర్యాదుల కమిటీ) వీటికి సంబంధించిన అన్ని రకాల ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాత రూ.2,11,80,761లను తిరిగి అందజేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి చెక్‌పోస్టుల వద్ద భారీకేడ్లను ఏర్పాటు చేసి తనిఖీలతో ప్రత్యేకంగా నిఘా పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 24(మంగళవారం) వరకు జిల్లావ్యాప్తంగా 104 కేసులకు సంబంధించి రూ.3,49,92,241లు ఉండగా అందులో 70 కేసులకు సంబంధించి సరైన ఆధారాలు, ధ్రువపత్రాలు సమర్పించిన నేపథ్యంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలన అనంతరం రూ.2,11,80,761లను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. ఐదు కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు కాగా, అందుకు సంబంధించిన నగదు రూ.28.18 లక్షలు ఉన్నాయన్నారు. సెక్యూరిటీ ఇతర దరఖాస్తులకు సంబంధించి 34 పెండింగ్‌లో ఉండగా, దీనికి సంబంధించి రూ.1,09,93,480లకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ విషయంలో కేసుల విచారణ జరుగుతోందని, వాటిని కూడా త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురి కావద్దనే ఉద్దేశంతో స్వాధీనం చేసుకున్న సొత్తు పరిశీలన కోసం జిల్లా ఫిర్యాదుల కమిటీ (గ్రీవెన్స్ కమిటీ)ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలించవద్దని, ఈ విషయంలో అధికారులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీలో కన్వీనర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి(91001 15724), సభ్యులుగా డీటీవో నర్సింహరావు (77999 34204) జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి (73309 99280) వ్యవహరిస్తున్నారని, ఏవైనా సమస్యలుంటే కమిటీని సంప్రదించాలన్నారు.

27న క్రీడాకారుల ఎంపిక

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లా జూడో, ఆర్చరి, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడల ఎంపికలు శుక్రవారం హకీంపేట్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో అండర్–14, 17 బాలబాలికలకు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల నిర్వాహణ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనే అండర్–14, అండర్–17 బాలబాలికలు శుక్రవారం ఉదయం 8.30 గంటలలోపు చేరుకోవాలని పీడీలు, పీఈటీలు, క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారుల అర్హత ఫామ్‌తో పాటు బోనాఫైడ్, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు తీసుకురావాలని, సర్టిఫికేట్లపై హెచ్ఎం సంతకం, స్టాంప్ ఉండాలన్నారు. ఫోన్: 83744 61481, 98486 29132.

మేడ్చల్ టిక్కెట్ బీసీలకు కేటాయించాలి

బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.రవీందర్‌గౌడ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ(బీజేపీ) టికెట్‌ను వెనుకబడిన సామాజిక వర్గాల(బీసీ)కి చెందిన తనకు కేటాయించాలని అధిష్టానాన్ని కోరినట్లు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి నూనెముంతల రవీందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, రాష్ట్ర నేతలు ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశానన్నారు. మేడ్చల్ టికెట్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 15 ఏళ్లుగా బీజేపీలో క్రియాశీలకంగా పని చేస్తున్నానని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు పోరాటంలో దాదాపు 40 రోజు లు జైలు జీవితాన్ని అనుభవించినట్లు ఆయన తెలిపారు. 20 ఏళ్లుగా మేడ్చల్ నియోజకవర్గం బీజేపీలోని ఒకే సామాజికవర్గం ఆధీనంలో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తూముకుంట మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, బీజేవైఎం ఎంసీపల్లి అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన భూదమ్మ అనారోగ్య కారణంగా బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో భారీగా మద్యం స్వాధీనం



ఉప్పల్: ఇంట్లో మద్యం నిల్వ ఉంచుకొని అధిక రేట్లకు విక్రయిస్తున్న బెల్టు షాపుపై ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి భారీగా మద్యం స్వాధీనం చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధి కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట సౌభాగ్యనగర్ వీధి నంబర్–4, ప్లాట్ నంబర్–151లో నివాసముంటున్న ఒ.దానమ్మ(60) మద్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచుకుని అధిక రేట్లకు విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. ఇంట్లో లభ్యమైన దాదాపు రూ.1,56,690 విలువ చేసే వివిధ బ్రాండ్ల మద్యం సీసాలు, రూ.27,300 విలువ గల బీరు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.